క్లుప్తంగా

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీసత్యసాయి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థిని లక్ష్మిప్రియ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాలలో 685 మార్కులతో ఆలిండియా 6666 ర్యాంకును సాధించింది. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి పాఠశాల ప్రిన్సిపాల్ నాగలింగం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థిని లక్ష్మిప్రియ, తల్లితండ్రులు మల్చలం మురళీ, మేఘన దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. విద్యార్థి దశలో చదువుపై ఏకాగ్రత, ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

15న దేవాలయ భూములకు వేలం

కొందుర్గు: కొందుర్గు లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి సంబంధించిన భూములను ఈ నెల 15న వేలం వేయనున్నట్లు ఈ శ్రీనివాసశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగన్నగూడ గ్రామ పరిసర ప్రాంతంలో గల వ్యవసాయ భూములను మూడేళ్లపాటు పంటలు సాగుచేసుకోవడానికి ఆసక్తి గల రైతులు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వేలంలో పాల్గొనేవారు ముందుగానే రూ. 2వేలు దరావత్ చెల్లించాలన్నారు.

నేడు మండల సమావేశం

మొయినాబాద్‌రూరల్: నేడు మొయినాబాద్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి సభ్యుల ఫోరం లేనందున వాయిదా వేశామని సూచించారు. తిరిగి ఈ సమావేశాన్ని 13వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు గునుగుర్తి నక్షత్రం అధ్యక్షతన నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీతో పాటు పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు సమయానికి హాజరుకావాలని ఆమె కోరారు.

సరస్వతి శిశుమందిర్‌లో గాయత్రీ యజ్ఞం



పాఠశాలలో యజ్ఞం నిర్వహిస్తున్న సిబ్బంది

మొయినాబాద్: పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా మండల పరిధిలోని పెద్దమంగళారంలో ఉన్న రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో బుధవారం గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. పాఠశాల కమిటీ కార్యదర్శి దోమ కృష్ణగౌడ్ దంపతులు, కోశాధికారి బద్దం ప్రతాప్‌రెడ్డి దంపతులు పూజా కార్యక్రమాల్లో కూర్చొని యజ్ఞం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు ఓంరెడ్డి, ప్రధానాచార్యులు మమతారెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శానిటేషన్ బాధ్యత గ్రామపంచాయతీలదే

బడిబాట సమీక్షలో జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ బాధ్యత గ్రామపంచాయతీలు తీసుకోవాలని జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంఈఓ శంకర్‌రాథోడ్ ఆధ్వర్యంలో బడిబాట సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులు తమవంతు సహకారం అందించాలని కోరారు. పాఠశాలల్లో పరిశుభ్రత సక్రమంగా లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు గురవుతారన్నారు. మౌలిక వసతుల ఏర్పాటులో పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహించకుండా పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. పాఠశాలల్లో కావాల్సిన వసతులను ఏర్పాటు చేసేందుకు సిబ్బందిని నియమించి ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పాఠశాలల అభివృద్ధి బాధ్యతను తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బన్సిలాల్, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోగిన బడిగంట

మొదటిరోజు విద్యార్థుల హాజరు అంతంతే ● పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేసిన ఉపాధ్యాయులు

వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. చేవేళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో పిల్లలందరూ వేసవి సెలవులకు టాటా చెప్పి ఇక బడి బాట పట్టారు. అన్ని పాఠశాలల్లో మొదటిరోజు 50 శాతంలోపు విద్యార్థులే హాజరయ్యారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు.



మొయినాబాద్: చిలుకూరులో విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న ఎంపీపీ నక్షత్రం

మొయినాబాద్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. మొదటిరోజు అన్ని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. మొయినాబాద్ మండలంలో 32 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 14 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలలో మొదటిరోజు 50 శాతంలోపు విద్యార్థులే పాఠశాలలకు వచ్చారు. మండల పరిధిలోని చిలుకూరు పాఠశాలలో ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నక్షత్రం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తల్లిదండ్రులు తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, నోడల్ అధికారి నరసింహారావు, ప్రధానోపాధ్యాయులు నర్సింలు, బీమయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



షాబాద్: హైతాబాద్ ఉన్నత పాఠశాలలో...



నందిగామ: చేగూరు ఉన్నత పాఠశాలలో..

క్రమశిక్షణతో చదువుకోవాలి

నందిగామ: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువును అలవర్చుకోవాలని ఎంపీపీ ప్రియాంక సూచించారు. మండల పరిధిలోని చేగూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజారెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ అపర్ణ, నోడల్ ఆఫీసర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హైతాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం హెచ్‌ఎం వసంతతో కలిసి వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదివించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కంకణం కట్టుకోవాలన్నారు. హైతాబాద్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతిలో మండల స్థాయిలో అత్యధిక జీపీఏ 9.3 సాధించిన విద్యార్థులు స్వాతి, శ్రీతికలను సన్మానించి, బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్, మాధవి, గోవింద్, షైనీ, మురళీ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



కొందుర్గులో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేస్తున్న అధికారులు

కొందుర్గు: ప్రభుత్వ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీపీ రాజేశ్‌పటేల్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అదేవిధంగా నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు అందిస్తూ పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంఈఓ కిష్టారెడ్డి, హెచ్‌ఎం వరప్రసాద్, నాయకులు కృష్ణారెడ్డి, మానయ్య, సుధాకర్‌గౌడ్, గోపాల్, నరేందర్, శ్రీను గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



కొత్తూరు: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా ఆయన మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో బుధవారం వైస్ ఎంపీపీ శోభాలింగం నాయక్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో బుధవారం విద్యార్థులు హుషారుగా పాఠశాలలకు హాజరయ్యారు. మండలంలో 24 ప్రాథమిక పాఠశాలలు, 04 ప్రాథమికోన్నత, 05 ఉన్నత, 1 కేజీబీవీ, 1 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం అన్ని పాఠశాలల్లో సుమారుగా 3 వేలకుపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, మొదటిరోజు అన్ని పాఠశాలల్లో దాదాపుగా విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంగోర్‌నాయక్, నాయకులు దేవేందర్ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలతోనే స్వాగతం

- నామమాత్రంగా హాజరైన ఉపాధ్యాయులు
- అపరిశుభ్రంగా పాఠశాలల ఆవరణలు, బాత్‌రూమ్‌లు
- పూర్తికాని అమ్మ ఆదర్శ పనులు

శంకర్‌పల్లి: పాఠశాలలకు వచ్చేందుకు విద్యార్థులే కాదు.. ఉపాధ్యాయులు మారం చేస్తున్నారు. నేను కాసేపు ఉండి వెళ్లిపోతా.. మిగతా కాసేపు నువ్వు ఉండు అన్నట్లు లెక్కలు వేసుకుంటున్నారు. పాఠశాల వదలడానికి సమయం కాకముందే విద్యార్థులను ఇంటికి పంపేశారు. అన్ని పరిశీలించాల్సిన మండల అధికారులు ఇవేవి మాకు సంబంధం లేనట్లు వ్యవహరించడం గమనార్హం. బుధవారం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. చాలా పాఠశాలల్లో మొదటిరోజు బడికి వచ్చేందుకు విద్యార్థులు విముఖత చూపగా.. ఉపాధ్యాయులు సైతం అదే బాటలో కొనసాగడం ఆశ్చర్యం కలిగించింది. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల, మన ఊరు–మన బడి కింద పాఠశాలల్లో మరమతుల కోసం భారీ ఎత్తున నిధులు మంజూరు చేసినా.. పనులు మాత్రం అంతంత మాత్రంగానే జరిగాయి. శంకర్‌పల్లి మున్సిపాలిటీ, మండలంలో మొత్తం 4828 మంది విద్యార్థులకు గాను ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు మొత్తంగా 54 ఉన్నాయి. వీటిలో 273 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా.. 260 మంది ఉపాధ్యాయులు ప్రస్తుతం పని చేస్తుండగా.. 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



చేవెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట వర్షపు నీరు



కొండకల్ పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

బుకాయింపులు

శంకర్‌పల్లి పట్టణం, మండలంలోని పాఠశాలల్లో కేవలం 13 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. అయినా చాలా మంది ఉపాధ్యాయులు తమని డిప్యూటేషన్లపై మరో పాఠశాలలకి పంపుతున్నారని బుకాయిస్తున్నారు. వాస్తవానికి విద్యాశాఖలో డిప్యూటేషన్లపై పంపడం అనేది లేదు. కానీ మొదటిరోజు పాఠశాలలకు రాని ఉపాధ్యాయులు మాత్రం ఈ విధమైన సమాధానాలు ఇచ్చారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామంతాపూర్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయురాలు ఉదయం పాఠశాలకి వచ్చిందో లేదో తెలియదు కానీ.. మళ్లీ సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో వచ్చి సంతకం చేసి వెళ్లారు. అదే ఫతేపూర్ పాఠశాలలో మరో ఉపాధ్యాయుడు అసలు పాఠశాలకే రాలేదు. ఉన్న ఉపాధ్యాయురాలిని వివరణ కోరగా.. ఆమె పెండింగ్ బిల్స్ ఇవ్వడానికి వెళ్లిందని ఒకసారి, మరో పాఠశాలకి డిప్యూటేషన్‌పై వెళ్లిందని మరో సమాధానం ఇచ్చారు. దీనిపై మండల విద్యాధికారిని వివరణ కోరే ప్రయత్నం చేయగా.. ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

అరకొరగా యూనిఫాంలు.. అందని నోటుబుక్స్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం రెండు జతల స్కూల్ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు అందిస్తోంది. అయితే శంకర్‌పల్లిలో మాత్రం పరిస్థితి వేరే విధంగా ఉంది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి కొన్ని పాఠశాలలకు ఒక్కో జత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందించగా.. నోటు పుస్తకాలు మాత్రం ఏ పాఠశాలకు అందించలేదు. దీనిపై ఉపాధ్యాయులను అడగగా.. మండల వనరుల కేంద్రానికి నోటుబుక్స్ రాలేదని, అందుకే విద్యార్థులకు అందించలేకపోయామని తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించి, విద్యార్థులకు కనీస సౌకర్యాలు అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చేవెళ్ల: మండలంలోని చాలా పాఠశాలలు విద్యార్థులకు పాత సమస్యలతో స్వాగతం పలికాయి. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా, చెత్తచెదారాలతో నిండిన మరుగుదొడ్లు, పాఠశాలల ఆవరణలో వర్షం నీటితో బురదమయంగా ఇలా అనేక సమస్యలు మొదటిరోజునే విద్యార్థులకు కనిపించాయి. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట వర్షపునీరు నిలిచి బురదమంగా మారింది. అంతేకాకుండా తరగతి గదులు మినహా పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లు అపరిశుభ్రంగానే ఉన్నాయి.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



చేవెళ్లలో..



మొయినాబాద్‌రూరల్: ఎన్కెపల్లి పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న పోచయ్య, సిబ్బంది

మొయినాబాద్ రూరల్: ప్రతి మనిషి జీవితంలో వెలుగులు నింపేది చదువేనని, అదే మన ఆయుధం, అక్షరం, అక్షరం కలిపితే పదం అవుతుందని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య పేర్కొన్నారు. మొదటిరోజు బుధవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మామిడితోరణాలు అలంకరించి విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోచయ్య హెచ్‌ఎం లక్ష్మారెడ్డితో కలిసి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు ఉచితంగా అందజేస్తున్నారని సూ చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయమంగా పెరిగిందన్నారు. తల్లిదండ్రులు బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, రాములు, బందయ్య, సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ హిమబిందు, ఎంఈఓ అక్బర్‌లు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు.

సమానత్వం కోసమే ఏకరూప దుస్తులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ సమానత్వంగా ఉండాలనే ఆలోచనతోనే ప్రభుత్వం యూనిఫాంలు అందిస్తుందని ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలి శ్రీశైలం అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి ఆధ్వర్యంలో కావలి శ్రీశైలం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో సంజీవయాదవ్, మల్లేశ్, పంచాయతీ కార్యదర్శి తేజస్వి ని, ఉపాధ్యాయులు అరుణ, శ్రీదేవి, వందన, జ్యోతిలక్ష్మి, శారదమ్మ, సుమిత్ర పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా పనిచేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని, అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జంగయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. షాద్‌నగర్ నుంచి పరిగి ఆర్‌అండ్‌బీ రోడ్డును నాలుగులేన్ల రోడ్డుగా ఏర్పాటు చేయడానికి పరిగి ఎమ్మెల్యేతో కలిసి ప్రతిపాదనలు పంపించామన్నారు. కొందుర్గులో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల సిబ్బందికి సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ రాగమ్మ, వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ లాలయ్య, ఎంఈఓ కిష్టారెడ్డి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో..

జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీలకతీతంగా ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఆశ్రా బేగమ్, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్‌తోపాటు అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


కొందుర్గు: గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి ప్రాథమిక పాఠశాలలో జగన్(45) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అతడి భార్య గీత జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది.వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే వీరు షాద్‌నగర్ పట్టణంలో నివసిస్తున్నారు. కాగా మంగళవారం రాత్రి జగన్‌కు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అతడిని షాద్‌నగర్‌లోని ఓ ప్రైయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో కొందుర్గు, జిల్లేడ్‌చౌదరిగూడ మండలాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పలు గ్రామాల నాయకులు, ఉపాధ్యాయులు జగన్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానూభూతి తెలిపారు. బుధవారం ఆయన మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం నాగర్‌కర్నూల్ తరలించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

షాద్‌నగర్‌రూరల్: కనీస వేతనాలను చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ బిల్ కలెక్టర్లు కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మున్సిపల్ బిల్ కలెక్టర్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో కుటంబాన్ని పోషించలేకపోతున్నామని, ఆర్థిక ఇబ్బందులతో కాలం వెల్లదీస్తున్నామన్నారు. ఉద్యోగ భద్రతకు నోచుకోని మాకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. బిల్ కలెక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం బిల్ కలెక్టర్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాములు, శివశంకర్, భాస్కర్, రవికుమార్, నరేశ్, వెంకటేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా



ఆశలతో కలిసి వైద్యురాలికి వినతిపత్రం అందజేస్తున్న సాయిబాబా

కొత్తూరు: ఆశవర్కర్ల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఆయన బుధవారం పలువురు ఆశావర్కర్లతో కలిసి కొత్తూరు పీహెచ్‌సీలో వైద్యురాలు ఝాన్సీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు ప్రభుత్వం నిర్వహించనున్న పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యకరమైన సమాజ స్థాపనలో భాగంగా ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో ఆశాల కృషి ఎంతో ఉందన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో ఆశాలు గర్భిణులు, బాలింతలకు వైద్యసదుపాయాల గురించి అవగాహన కల్పిస్తూ వారికి సకాలంలో వైద్యం అందే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. సమస్యల సాధనకు ఆశవర్కర్లు ఐక్యంగా ఉండాలన్నారు. సమస్యల సాధనలో భాగంగా నేడు(గురువారం) చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆశాలు పాల్గొని సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆశాలు అనిత, మహేశ్వరి, బుజ్జి, కవిత, శశిరేఖ, మాధవి తదితరులు పాల్గొన్నారు.